## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

**తాండూరు, జనవరి 31, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం తాండూరు పట్టణంలోని మం డల పరిషత్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. 253మంది లబ్దిదా రులకు సుమారు రూ. 2కోట్ల53లక్షల విలువ గల కళ్యాణలక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఎంపీపీ అని తాగౌడ్, వైస్ ఎంపీపీ స్వరూప, పీఏసిఎస్ చైర్మన్ రవిగౌడ్, తహసి ల్దార్ తారాసింగ్ పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## పారిశుద్ధ్య కార్మికురాలు లక్ష్మీకి జాతీయ ఉత్తమ ఆవార్డు

**ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఆవార్డు**

**కొడంగల్, జనవరి 31ప్రభాతవార్త** జాతీయ స్థాయి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా కొడంగల్ మండలంలోని హస్నాబాద్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలిగా లక్ష్మీ ఆవార్డును అందుకున్నారు. మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అమె ఆవార్డును అందుకు న్నట్లు గ్రామసర్పంచ్ బి.పకీరప్ప తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఆవార్డు అందు కోవడంతో లక్ష్మీని గ్రామసర్పంచ్ పకీరప్ప, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు శుభాకాం క్షలు తెలిపి అభినందించారు.



నరేంద్రమోదీతో కార్మికురాలు లక్ష్మీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

## చదువునే ఆయుధాంగా మలుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**

**వికారాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** చదువు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వసతి గృహ పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో ప్రేరణ, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలపై తర్ఫీదు, మనోధైర్యాన్ని, వ్యక్తిగత నైపుణ్యాన్ని పెంచేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లచే తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో భయం, ఉత్సాహం ఉంటుందని, లక్ష్యాన్ని సాధించే దిశగా చదువుపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఏవైనప్పటికీ చదువుకోవాలి అనే కోరిక గట్టిగా ఉంటే ఏదైనా సాధ్యమేనని కలెక్టర్ అన్నారు. విద్యార్థుల్లో లక్ష్యం గొప్పదిగా ఉండాలని,



హాజరైన విద్యార్థులు

చదువుల్లో డిగ్రీలు ముఖ్యం కాదని నైపుణ్యంతో కూడిన విద్య అని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు దొడ్డిదారిలో పరీక్షలు రాసి ఉత్తీర్ణులైతే భవిష్యత్తులో ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని కలెక్టర్ తెలిపారు. వసతి గృహాల్లో చదువుకున్న విద్యా ర్థులందరూ పేదరికం నుంచి వచ్చిన వారు కాబట్టి చదువుతో మీ భవిష్యత్తును మార్చుకొని మీ వంశ వృక్షంలో ఒక మలుపు దిశగా అడుగులు వేస్తూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యను అభ్యసించేందుకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వ ఎన్నో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, పరీక్షల సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి స్టడీ మెటీరియల్‌ను అందించడం జరుగుతుందని తెలిపారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లు సలహాలు సూచనలను తీసుకొని పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఆయనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, ఎస్సీ, బీసీ, సంక్షేమ శాఖ అధికారులు ఉమాపతి, వీరానందం, భీమ్‌రాజ్, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లు కె.రామచంద్రుడు, మాధవి, మహేందర్, శ్రీధర్, పీ.వీ రెడ్డి పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 2న గ్రామపంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల బాధ్యతలు..?

**61 గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకాలకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు**

**నేడో..రేపో ఉత్తర్వుల జారీకి అవకాశం**

**ఇక ముగిసిన సర్పంచుల ఐదేళ్ల పదవీకాలం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 31, ప్రభాతవార్త**

ఫిబ్రవరి 2వ తేదీన జిల్లాలోని 61 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించటానికి జిల్లా అధికార యంత్రాంగం అంతా పూర్తి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగ ఉన్న 61 గ్రామపంచాయతీలకు 61మంది ప్రత్యేక అధికారులను నియమించటానికి ఎంపిడిఓలు, మండల పంచాయతీ అధికారిల ద్వారా జిల్లా పంచాయతీ అధికారికి ప్రత్యేక అధికారుల నియామకాలకు ప్రతిపాదనలు వెళ్లటంతో దీంతో డిపిఓ ఆఫీస్ నుంచి జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు 61మంది గ్రామపంచాయతీల స్పెషల్ ఆఫీసర్ల జాబితాను సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఇక గురువారం ఫిబ్రవరి 1వ తేదీన స్పెషల్ ఆఫీసర్లకు నియామక ఉత్తర్వులు కలెక్టర్ నుంచి అంద వచ్చని సమాచారం. ఇక గ్రామపంచాయతీల సర్పంచుల, ఉపస ర్పంచుల, వార్డుసభ్యుల, కోఆప్షన్‌సభ్యుల ఐదేళ్ల పదవీ కాలం పూర్తి కావటంతో ఇక గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ప్రభుత్వం నుంచి పంచాయతీ అధికారులకు ఆదేశాలు రావటంతో అధికారుల పాలన ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు స్పష్టం అవుతుంది. జిల్లా పరిధిలో ఐదు మండలాలు, 61 గ్రామపంచాయతీలు ఉన్నాయి. మండలాల వారీగ గ్రామపంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల నియామకం పూర్తి జరిగి ఫిబ్రవరి 2న బాధ్యతలు స్వీకరిస్తారని జిల్లా పంచాయతీ అధికారుల నుంచి విశ్వసనీయ సమాచారం.

## ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు

**ఇబ్రహీంపట్నం, జనవరి 31, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంకాని విజయ్ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ..గద్దరన్న మాట, పాట, ఆట ద్వార ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరా డారన్నారు. గద్దరన్న జీవితమే ఒక పోరాటమన్నారు. గద్దర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాంఖాల కర్ణాకర్, దొంతరమోని రాజు, మహేష్, నగేష్, శ్యామ్, ఇమ్రాన్, కిరణ్, అమరేందర్ తదితరులున్నారు.

# చేవెళ్లపై సీఎం స్పెషల్ ఫోకస్

- చేవెళ్లలో గెలుపే లక్ష్యంగా వ్యూహరచన
- స్వయంగా బాధ్యతలు పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- అభ్యర్థి ఎంపికలో ఆచీతూచిగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్
- ఇంకా కొలిక్కిరాని అభ్యర్థి ఎంపిక
- కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠ
- ఈ నెలాఖరులో అభ్యర్థి ఎంపికకు తెర

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, జనవరి 31 ప్రభాతవార్త :** చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక వ్యూహరచన చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ గత 20 రోజులుగా పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి ఆయా జిల్లాలు, పార్లమెంట్ స్థానాలకు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు రాష్ట్ర మంత్రులకు పార్లమెంట్ స్థానాలకు ఇంచార్జీలుగా నియమించిన విషయం విధితమే. అయితే మహబూబ్ నగర్, రంగారెడ్డిలోని చేవెళ్ల పార్లమెంట్‌కు సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంచార్జీగా భాధ్యతలు తీసుకోవడంతో ఈ రెండు పార్లమెంట్ స్థానాలు కీలకంగా మారాయి. ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులను కూడా ఎంపిక చేయడంలో ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ రెండు పార్లమెంట్‌లో మహబూబ్‌నగర్‌కు దాదాపుగా వంశీచందర్‌రెడ్డి అనే ప్రచారం కొనసాగుతుంది. ఆయన ఇప్పటికే మహబూబ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం కూడా మొ దలుపెట్టారు. షాద్‌నగర్‌తో పాటు పలు నియోజకవర్గా ల్లో పర్యటిస్తున్నారు. ఇక చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో ఇంకా ఓ కొలిక్కి రాలేదు. ఈ స్థానం నుంచి ఎవరూ పోటీ చేస్తారనే ఉత్కంఠ కాంగ్రెస్ పార్టీ లో మొదలైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపికలో ఏఐసీసీ పెద్దలు కీలకంగా వ్యవహరిస్తారా.. లేక రేవం త్‌రెడ్డియే ఎంపిక చేసిన అభ్యర్థి చేవెళ్ల బరిలో ఉంట రా.. అనే సందిగ్దం మొదలైంది. చేవెళ్ల పార్లమెంట్ ఏర్ప డిన మొదట్లో మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందగా, రెండవసారి జరిగిన పార్ల మెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిపై బీఆర్ఎస్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపొందారు.

చేవెళ్ల పార్లమెంట్ ముఖ చిత్రం



మూడసారి ఎన్నికల్లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాం గ్రెస్ నుంచి పోటీచేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపొందారు. మూడు సార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒకసారి మాత్రమే కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలవగా రెండు పర్యాయాలు ఇతర జిల్లాలకు చెందిన అభ్యర్థులు గెలుపొందారు. ఇది ఇలా ఉండగా వరుసగా రెండవసారి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసు కున్న దాఖలాలు లేవు. ఇక ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేవెళ్ల పార్లమెంట్‌పై పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు చేవెళ్ల పార్లమెంట్‌పై గట్టి పట్టున్న నాయకుల పనితీరుపై ఆయన ప్రత్యేక దృష్టిసారించారని సమాచారం. కాంగ్రెస్ పార్టీ నుంచి జిల్లాలో పట్టున్న నాయకులను రంగంలో దింపుతారా...లేక బీఆర్ఎస్ పార్టీలో కీలక పదవులు నిర్వహించిన సీనియర్ నాయకుల కుటుంబాల నుంచి అభ్యర్థులను ఎంపిక చేస్తారా..అనే ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే జిల్లాలోని అనేక నియోజకవర్గాలలోని మాజీ శాసన సభ్యులు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రిని స్వయంగా వారితో రాజకీయ భవిష్యత్‌పై సమాలోచనలు జరుపుతున్నారు. ఇప్పటికే కొంతమంది బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరికొద్ది రోజుల్లో చేవెళ్ల పార్లమెంట్‌లో వాడివేడిగా రాజకీయాలు ప్రారంభం కొనసాగనున్నాయి. ఇప్పటికే చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని శాసన సభ స్థానాల్లో పార్లమెంట్ ఎంపికపై మల్లగుల్లాలు కొనసాగుతున్నప్పటికి ఈ ఎంపికలో రాష్ట్ర ముఖ్యమంత్రి కీలక రోల్ పోషిస్తారా...లేక ఢిల్లీలోని ఏఐసీసీ పెద్దలే ప్రత్యేక పాత్ర పోషిస్తరా.. అనే విషయంపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ కొనసాగుతున్నప్పటికి ఈ స్థానం అభ్యర్థి ఎంపిక మాత్రం ముఖ్యమంత్రికే వదిలేస్తారా అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనప్పటికి చేవెళ్ల పార్లమెంట్ ఎన్నిక ఈ సారి ఉత్కంఠ భరితంగా కొనసాగుతుందని రాజకీయ మేధావులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ పార్టీ గుర్తు





సీఎం రేవంత్‌రెడ్డి



మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి విజయోత్సవ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు

# పార్లమెంట్ ఎన్నికలకు బిఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలి

## మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పిలుపు

**శామీర్‌పేట, జనవరి 31, ప్రభాతవార్త** ఇక పార్లమెంట్ ఎన్నికలకు బిఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని, ప్రజలు బిఆర్ఎస్ పక్షాన ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసి రాష్ట్రంలో అధికారం చేపట్టిందని మాజీ మంత్రి, పార్టీ ఇన్‌చార్జి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి విజయోత్సవ సభకు బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా నిరంజన్‌రెడ్డి విచ్చేశారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా సిఎంఆర్ పంక్షన్‌హాల్‌లో కీసర ఉమ్మడి మండల బిఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధుల, పార్టీ నాయకుల సమావేశం జరిగింది. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని సభలో పలువురు సన్మానించారు. ఈ సందర్భంగ పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌తో బిజెపి స్నేహం కొనసాగుతుందని, అయితే బిఆర్ఎస్ ఎమ్మెల్సీల నియామకానికి ప్రతిపాదనలు గతంలో పంపితే ఆమోదం తెలుపలేదని, అదే కాంగ్రెస్ ఇద్దరు ఎమ్మెల్సీల కోసం ప్రతిపాదనలు పంపితే గవర్నర్ ఆమోదించటంలో అంతర్యం ఏమిటని బిజెపి, కాంగ్రెస్ తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చిన్న చిన్న కారణాల చేత బిఆర్ఎస్ ప్రభుత్వం ఓటమిని చవిచూసిందన్నారు. కేవలం 1.89 శాతం ఓట్ల తేడాతోనే బిఆర్ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంను చేపట్టిందన్నారు. అయితే బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఎన్నికల్లో పనిచేయలేదని, కాంగ్రెస్ పార్టీ మోస పూరిత గ్యారంటీ పథకాల హామీలతో అధికారంలోకి వచ్చిందని అన్నారు. స్థానిక సంస్థల్లో బిఆర్ఎస్ పటిష్టంగ ఉందని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగ కాంగ్రెస్ ఇక మూడు రాష్ట్రాలకే అధికారంలో పరిమితం అయిందని ఆయన ఎద్దేవా చేశారు. విద్యుత్, సాగునీరు, త్రాగునీరుతో పాటు పలు అభివృద్ధి పనులు జరిగిన సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత గత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు బిఆర్ఎస్‌కు ఓటు వేయలేదని అన్నారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఎంపిగా, ఎమ్మెల్యేగా, (మంత్రిగా), మరో సారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన బిఆర్ఎస్ శ్రేణులకు దన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటా సేవలు అందిస్తానని అన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం వాచ్‌మెన్‌గా పనిచేస్తానని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అద్బుతంగ చేస్తానని అన్నారు. మాజీ సిఎం కెసిఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదని, మేడ్చల్‌లో బిఆర్ఎస్ గెలిచింది. కాంగ్రెస్ ఓటమిని చవిచూ సిందని అధికారం చెలాయిస్తే కాంగ్రెస్ వారిని సహిం చేది లేదని మల్లారెడ్డి స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బందు, బిసిబంధు, మైనా ర్టీ బంధు అన్నింటిని బంద్ పెట్టారని, ఇక కెసిఆర్‌కిట్టు ఇవ్వటం లేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపిగా బిఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలవటం ఖాయమని మల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దీనిలో కీసర మండల సర్పంచులను, ఉపసర్పంచులను, వార్డుసభ్యులను పదవీ ముగింపు సందర్భంగ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి వారిని సన్మానించి అభినం దించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి సిహెచ్ మహేందర్‌రెడ్డి, సిహెచ్ భద్రారెడ్డి, జడ్పీవైస్ చైర్మన్ బెస్త వెంకటేశ, నాగారం మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డి, దమ్మాయిగూడ చైర్మ న్ ప్రణీతగౌడ్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ అధ్యక్షులు దర్గా దయాకర్‌రెడ్డి, కీసర, నాగారం, దమ్మాయి గూడల పార్టీల అధ్యక్షులు జె.సుధాకర్‌రెడ్డి, శ్రీధర్, కె.తిరుపతిరెడ్డి, పలువురు పార్టీకి చెందిన ప్రజాప్రతిని ధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**కలెక్టర్ గౌతమ్ అధికారులకు ఆదేశాలు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 31, ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ఎంపి ల్యాడ్స్ నిధులను మార్చి నెలాఖరు వరకు వినియోగించాలని సంబంధిత అధికారులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక అధికారి (సిపిఓ) ఎం.మోహన్‌రావుతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి నిధులు సిడిఎఫ్, ఎంపిల్యాడ్స్, కృషియల్ బ్యాలెన్స్ ఫండ్ (సిబిఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులు, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, డిఎఫ్ఓ, డిడబ్ల్యుఓ, డిఆర్‌డిఏ, ఇరిగేషన్, జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, పోలీసు శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలని అపుడే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయటానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఎంపి ల్యాడ్స్‌కు సంబంధించి మార్చి 31వ తేదీ వరకు పూర్తి చేయాలని ఈ విషయంలో ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని సూచించారు. అలాగే జిల్లాలోని ఆయా నియోజకవర్గాల అభివృద్ధి నిధులతో పాటు ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డిఎఫ్), వర్క్స్ సంబంధించి పనులు ఫిబ్రవరి చివరి వరకు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. అంతకు ముందు అధికారులతో అభివృద్ధి పనులపై నియోజకవర్గాల వారిగా పనుల పురోగతిని ప్రత్యేకంగ అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఇప్పటి వరకు ఎన్ని పనులు పూర్తి అయ్యాయి, ఇంకా ఎన్ని పనులు ఏ స్థాయిలో పెండింగ్ దశలో ఉన్నాయి. పూర్తిగ క్యాన్సల్ ఎన్ని అని అనే వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలో పనులు చేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ విషయంలో వేరే వారికి ఆపనులను అప్పగించటం జరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టుకుని పెండింగ్ పనులను కాంట్రాక్టర్లు వెంటనూ పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు ప్రజల కోసం అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. అలాగే మరో పదిహేను రోజుల తరువాత సమావేశాన్ని నిర్వహిస్తామని, ఆ సమావేశం సమయం వరకు అభివృద్ధి పనులు పూర్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

## మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**

**వికారాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** మానవ వనరులను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆకాంక్షించారు. జిల్లాలో మహిళా సంఘాల ఆర్థిక పురోగతి, సంఘాల పనితీరు, రుణాల సద్వినియోగంపై వికారాబాద్ స్త్రి శక్తి భవన్ లో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల మహిళలు వారి ఆర్థిక ఎదుగుదలతో పాటు సామాజిక సమస్యలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో మహిళలు, వితంతువుల సమస్యలు, బాల్య వివాహాలను అరికట్టేందుకు, ఆడ మగ తేడా లేకుండా వివిధ సమస్యలపై స్పందించి పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అతివేగంగా అభివృద్ధి దశలో పయనించే క్రమంలో వైద్య కళాశాలతో పాటు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, నైపుణ్యాభివృది యూనివర్సిటీ జిల్లాలో ఏర్పాటు చేయబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతలో భాగంగా మహిళలు వివిధ రంగాల్లో శిక్షణలు పొందే దిశగా విద్యార్హతల జాబితాలను రూపొందించాలని డిఆర్డిఓ కు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ కృష్ణన్, అదనపు డీఆర్‌డీఎ నర్సింలు, డిపిఎం లు రామ్నాథ్ నర్సింలు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అలివేలు, కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ ఓట్లు దొంగ ఓట్లు అన్న వారిపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్ రాహుల్ శర్మకు ఫిర్యాదు చేస్తున్న ఎబ్బనూర్ గ్రామ మైనార్టీలు

**ధారూర్ ,జనవరి 31, ప్రభాతవార్త** మైనార్టీ ఓట్లు దొంగ ఓట్లు అని గ్రామానికి చెందిన కొందరు చెప్పడం సరికాదని అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బుధవారం ఎబ్బనూర్ గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు అదనపు కలెక్టర్ రాహుల్ శర్మకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వార మైనార్టీలను కించపరుస్తూ దొంగ ఓట్లని ఫిర్యాదు చేయడం సరికాదని మైనార్టీ నాయకులు అన్నారు. మేము తాతల తండ్రుల నుంచి కూడా ఎబ్బనూర్ గ్రామమే అని జీవనోపాధి కోసం వివిధ ప్రాంతాలలో నివసిస్తున్నామని మాకు ఇల్లు భూమి ఇదే గ్రామంలో ఉందని తెలిపారు. ఐదు కుటుబాలలో 187 ఓట్లు ఉన్నాయని వాటిని తొలగించాలని తెలుపడం సరికాదని అన్నారు. ఓటును సొంత గ్రామంలో వినియోగించడం తప్పా అని మండిపడ్డారు. పంచాయతీ కార్యదర్శి ఆర్ వీరేశంపై తప్పుడు ఆరోపణాలు చేయడం సరికాదన్నారు. ఫిర్యాదు స్వీకరించిన అదనపు కలెక్టర్ విచారణ జరిపించాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

## వృధాగా మంచినీరు..పట్టించుకోని అధికారులు

**ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ వంజరిబస్తీలోని మిషన్‌భగీరథ ట్యాంకు మంచినీరు వృదాగా పోతున్నది. ట్యాంకు నిండిపోయి నిత్యం నీరంతా వృదాగా పోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. అధికారులు లక్షలాది రుపాయలు వ్యయం చేసి మిషన్ భగీరథ ద్వారా గోదావరి జలాలను ఇక్కడికి తరలిస్తుండగా ట్యాంకు నిండిపోయి ప్రతిరోజు గంటల కొద్ది నీరు వృదాగా పోతున్నది. ట్యాంకు నుంచి నీరు పారుతుండటంతో వంజరిబస్తీలో చిన్నపాటి కాలువ ఏర్పడింది. వీధిలో రోడ్డు నీటికి కోతకు గురై అధ్వాన్నంగా తయారై వాహ నాల రాకపోకలకు, పాదచారులకు ఇబ్బందులు ఎదుర వుతున్నాయి. పంచాయతీ సిబ్బంది నీరు వృధాగా పోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలకు అసౌకర్యంగా మారుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ట్యాంకు వైపు చూడకపోవడంతో నీటి వృదాను అరికట్టే ప్రయత్నాలు చేయడం లేదు.



ఎదులాబాద్ వంజరిబస్తీలోని ట్యాంకు నుంచి వృధాగా పోతున్న మంచినీరు



ఝరాసంగం పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న శ్రీనివాస్

## పంచాయతి పాలక వర్గానికి సన్మానం

**ఝరాసంగం, జనవరి 31, ప్రభాతవార్త:** పంచాయతీ పాలకుల పదవీ కాలం ముగియడంతో బుధవారం ఝరాసంగం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాలకులను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, ఉపసర్పంచ్ లక్ష్మమ్మ, వార్డు సభ్యులను కార్యదర్శి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి సల్పినట్లు సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిఐకి సన్మానం



నూతన సీఐ రేణుకను సన్మానిస్తున్న ప్రైవేటు పాఠశాల యజమానులు

**అల్లాదుర్గం, జనవరి 31, ప్రభాతవార్త:** నూతన సీఐ రేణుక బాధ్యతలు స్వీకరించగా ప్రైవేటు పాఠశాలల యజమానులు బుధవారం ఘనంగా సన్మానించారు. సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి అల్లాదుర్గం, రేగోడు, పెద్ద శంకరంపేట్, టేక్మాల్ పోలీసు ఠాణాల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల యజమానులు సిఐని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ రేణుక మాట్లాడుతూ ఆయా గ్రామాల నుంచి విద్యార్థుల విద్యను అందుకునేందుకు ప్రయివేటు బస్సులో వెళుతుంటారని, బస్సులు ఆర్‌టిఏ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అని తెలుసుకోవాల్సిన అవసరం పాఠశాల యాజమాన్యంపై ఉంటుందని గుర్తు చేశారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సులో తరలిస్తే బస్సును సీజ్ చేస్తామని హెచ్చరించారు. ధృవపత్రాలు అందుబాటులో ఉంచుకుని బస్సులను రోడ్డెక్కించాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, పాఠశాలల యాజమానులు పాల్గొన్నారు.

## పరీక్షా పే చర్చలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ విద్యార్థిని



ప్రధాన మంత్రి పరీక్షా పే చర్చలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ విద్యార్థిని

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 31, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్ర మోది నిర్వహించిన పరీక్షా పే చర్చలో సంగారెడ్డిలోని సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థిని సాదాన్ సదాఫ్ పాల్గొన్నారు. సంపన్న భారత దేశం కోసం 5 ప్రతిజ్ఞలు అనే కార్యక్రమంలో విద్యార్థిని పాల్గొని పరీక్షలపై ఉన్న సందేహాలను నివృతి చేసుకుని ఉజ్వల భవిష్యత్తు కొరకు తన వంతు కృషి సల్పింది. పరీక్షా పే చర్చలో పాల్గొన్న విద్యార్థిని పాఠశాల కారస్పాండెంట్ కె అంథోనిరెడ్డిని అభినందించి సత్కరించారు. విద్య భవిష్యత్తు, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని, అందుకు విద్యార్థిని పాదన్ సదాఫ్‌ని ఉదహరించారు. విద్యార్థిని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కారస్పాండెంట్ కె అంథోని రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ శుభాకాంక్షలు



వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపుతున్న కార్పొరేటర్

**రామచంద్రాపురం, జనవరి 31, ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్నేహశబరీస్‌ను రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికై కార్పోరేటర్ కమిషనర్‌తో చర్చించారు. బాలవిహార్ పార్క్, శ్రీనివాస్ నగర్ కాలనీ మల్లీపర్పస్ ఫంక్షన్ హాల్, కాకతీయ నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఓల్డ్ ఆర్‌సిపురం మేట్‌మార్కెట్, హిందూ శ్మశానవాటిక, బస్సు రూట్ విస్తరణ, డివదర్‌తో సెంటరన లైటింగ్‌కు ఓవర్‌వ్యాగా కంప్యూటర్లో పూర్తిగా స్థలాలు చేయించడం జరిగింది. త్వరలోనే సంబంధిత అన్ని విభాగాల అధికారులతో పై తెలిపిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తామని, అభివృద్ధి పనుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని కమషనర్ పేర్కొనట్లు కార్పొరేటర్ వివరించారు.

## లింగాయపల్లిలో విద్యార్థులు స్వయం పాలన



చీకోడ్ పాఠశాలలో స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**పాపన్నపేట, జనవరి 31,ప్రభాతవార్త:** లింగాయిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఆనందోత్సవాలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు జ్ఞాపికలను అందచేశారు. విద్యాశాఖ మంత్రిగా ఆర్ సిద్దు, కలెక్టర్‌గా జి వైష్ణవి, డీఈఓగా ఏ స్నేహలత, డిప్యూటీ డీఈఓగా జి జ్యోత్న, ఎంఈఓగా శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులుగా డి పూజలు ఒక రోజు బాధ్యతలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఐఇయు జిల్లా అధ్యక్షులు జి ఆంజనేయులు, ఉపాధ్యాయులు సిద్ది రాములు, శ్రీనివాస్, దశరథం, అశోక్, ప్రభాకర్, పరశురాం, మహేందర్, రమేష్, పుష్పలత, కనకయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి ఎస్ఐగా నవత బాధ్యతల స్వీకరణ

**వెల్దుర్తి, జనవరి 31 ప్రభాతవార్త:** వెల్దుర్తి ఠాణా ఎస్ఐగా నవత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు వెల్దుర్తి ఎస్ఐగా పని చేసిన మధుసూదన్‌గౌడ్ మెదక్ ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి నవత బదిలీపై వెల్దుర్తికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ నవత మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూస్తానన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల నుంచి సిసిఐ పత్తి కొనుగోలు చేయాలి

### రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజు



పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలని దీక్ష చేస్తున్న రైతు సంఘం నాయకులు

**సదాశివపేట, జనవరి 31, ప్రభాతవార్త:** రైతుల నుంచి పత్తిని సిసిఐ కొనుగోలు చేయా లని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఆత్మకూర్ రోడ్డులో ఉన్న అన్నపూర్ణ సిసిఐ కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ, సిసిఐ, ప్రైవేటు వ్యాపారులు కుమ్మక్కయి రైతులను నిండాముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తిని కొనుగోలు చేయకుంటే రైతులు ఆర్థికంగా నష్టాలకు గురవుతారని వాపోయారు. రైతులు పంటను పండిస్తు వివరాలు ప్రభుత్వంవద్ద ఉన్నాయని, పంటను ప్రభుత్వం కొనుగోలు చేయక తప్పదన్నారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలవద్ద కనీస సౌకర్యాలు లేవని, రైతులు నిత్యం పాట్లు పడాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. సిసిఐలో కొను గోలు నిలిపివేయడంతో ప్రయివేటు వ్యాపారులు రైతులను దోపిడిచేస్తున్నారని మండిపడ్డారు. సిసిఐ లో క్వింటాలు పత్తిని రూ. 7020 కొంటే వ్యాపా రులు 5 నుంచి 6 వేల రూపాయలే అందిస్తున్నట్లు గుర్తుచేశారు. రైతులను దగా చేస్తున్న అధికారులు, వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి హామి చేయడంతో రైతు సంఘం నాయకులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘ: నాయకులు భూషణం, ఏసోబు ప్రసాద్, రైతులు జగదీష్, భాస్కర్, రవి, బాలమణి రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో పంటల వివరాలు సేకరించిన ఏవో

**వెల్దుర్తి, జనవరి 31 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలంలోని రామాంతాపూర్ గ్రామంలో బుధవారం ఏవో రాజశేఖర్ వరి పంటలను పరిశీలించి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాసంగిలో నారుమడి దశ నుండి ఆశించి మొగి పురుగు నష్టపరుస్తుందన్నారు. నివారణకు నారుమడిలో కార్బోఫ్యూరాన్ గుళికలు, 600 గ్రాముల పిప్రొనిల్ గుళికలు వేయాలన్నారు. ఒకవేళ నారుమడిలో వేయకపోతే పదిహేను రోజుల వయస్సు ఉన్న వరి పైరులో ఎకరాలకు కార్బోఫ్యూరాన్ గుళికలు, కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ గుళికలు చల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వందన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**వెల్దుర్తి, జనవరి 31 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు కళ్యాణలక్ష్మీ పథకం ఆసరాగా నిలుస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో 42 లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఇందులో 38 కళ్యాణలక్ష్మీ, 4 షాదీముబారక్ చెక్కులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి పథకం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. అనంతరం మండలంలోని ఆరెగూడెం గ్రామంలో కుర్మ సంఘంభవనానికి శంకుస్థాపన చేశారు. అలాగే పంతుల్‌పల్లిలో వైకుంఠ ధామం, సీసీ రోడ్లకు, ముదిరాజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేవిధంగా అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యనరకమంలో జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సుధాకర్‌గౌడ్, తహశీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, ఆర్ఐ భరత్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## నంది కంది పాలక వర్గానికి సన్మానం



నంది కంది పంచాయతీ పాలకులను సన్మానిస్తున్న దృశ్యం

**సదాశివపేట, జనవరి 31, ప్రభాతవార్త:** మండలంలోని నంది కంది గ్రామ పంచాయితీ పాలక వర్గాన్ని బుధవారం ఘనంగా సన్మానించారు. ఫిబ్రవరి 1వ తారీఖుతో పంచాయితీ పాలక వర్గం పదవి కాలం ముగుస్తుండటంతో బుధవారం పంచాయితీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

## వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉపాధ్యాయులు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**జహీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** ఖమ్మంలో ఫిబ్రవరి మాసంలో జరిగే తెలంగాణ ప్రోగ్రేసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలకు జహీరాబాద్ జోన్ నుంచి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ అన్నారు. జహీరాబాద్‌లో జోన్ కన్వీనర్ జానర్ధన్‌రెడ్డి, కో కన్వీనర్ బిచ్చయ్యల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు లక్ష్మయ్య యాదవ్, నాగేశ్వర్, జీవన్‌రావు, నాసర్ పటేల్, రాంచందర్ భీంవంశీ, రాంతీర్థ్ నర్సింలు, నాగన్న, అమృత్, జగదీశ్వర్య పాల్గొన్నారు.

## అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి : సిఐ

**చిన్నశంకరంపేట, జనవరి 31,ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, అంబేద్కర్ అడుగుజాడ్లో ప్రతిఒక్కరు నడవాలని రామాయంపేట సీఐ వెంకట్ తెలిపారు. బుధవారం మండల పరిధి కామారంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశ రాజ్యాంగాన్ని అంబేద్కర్ రచించారన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిచి దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పూలపల్లి యాదగిరి యాదవ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు, వైస్ ఎంపీపీ సత్యంగౌడ్,సత్యనారాయణ, ఎమార్పిఎస్ నాయకులు మురళి,క్రరై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు

**వెల్దుర్తి, జనవరి 31 ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తూప్రాన్ మండలానికి చెందిన ప్రజా గాయకుడు గద్దర్ తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించారని, ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారాన్నరు. అందరి మన్ననలు పొందిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని వారు కొనియాడారు. గద్దర్ ఆశయాలను వారు నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు పోతరాజు కుమార్, నాయకులు అశోక్, రమేష్, శేఖర్, పోచయ్య, రవి పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో పాత పంటల జాతర ఊరేగింపు



పట్టణంలో పాత పంటల జాతర ఊరేగింపును ప్రారంభిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** డిడిఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాత పంటల జాతర ఊరేగింపును బుధవారం పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం నుంచి అందంగా అలంకరించిన ఎడ్ల బండ్ల ఊరేగింపును అధికారులు ప్రారంభించారు. బండ్ల ఊరేగింపును ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అస్లామ్ ఫారేకి జాతర ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాత పంటల విత్తనాల్లో గల పోషక విలువలపై అవగాహన కల్పించారు. పాత పంటల భోజనంను స్వీకరిస్తే కలిగే ప్రయోజనాలపై సూచించారు. జాతర ఊరేగింపు పట్టణంలోన జాతీయ రహదారి గుండా కెనురా బ్యాంక గుండా సంఘమిత్ర పాఠశాల వరకు కొనసాగింది. ఆట పాటలతో జాతరను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రవీణ, జాతర కో-ఆర్డినేటర్ యస్ వినయ్ కుమార్, డిడిఎస్ సిబ్బంది చుక్కమ్మ, పూలమ్మ, చినన నర్సమ్మ, మంజుల, విజయలక్ష్మి, లక్ష్మమ్మ, అల్గోల్ నర్సమ్మ, చంద్రమ్మ, వినయ్‌కుమార్, బాలయ్య, మొగులయ్య, కమల్మ, శ్రీలయ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

**చిన్నశంకరంపేట, జనవరి 31,ప్రభాతవార్త:** ఉపాధీ హామీ పథకం ద్వారా మండలంలోని అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని డీఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేటలో 13వ విడత జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజీక తనిఖీ ప్రజాదర్బార్‌లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఆడిటింగ్‌ను చేపట్టారు. మండల వ్యాప్తంగా ఉపాధిహామీ పథకం ద్వారా రూ.6.50కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వివిధ గ్రామాలలో చేపట్టిన పనుల్లో ఈజీఎస్ సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని వారినుండి రూ.1,01,020 రికవరి చేయాలని, పెనాల్టి రూ.1500 రుపాయలను విధించినట్లు ఆయన తెలిపారు. నిర్దేశించిన సమయంలో డబ్బులను జమచేయాలని, పనులు, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభీవృద్ధిశాఖ అధికారి విరోజ, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్ రెడ్డి, జిల్లా అధికారులు రమాకాంత్, శ్రావణ్, దేవేందర్, ఎంపీడీవో ప్రవీణ్, ఎంపివో గిరిధర్‌రెడ్డి,ఏపీవో వెంకటసాయిగౌడ్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఆర్డీవో శ్రీనివాస్

# అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం

### ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**శివ్వంపేట, జనవరి 31 ప్రభాతవార్త:** అబద్ధపు హామీలు ఇచ్చి రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి రావడం దారుణమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శభాష్‌పల్లి, గోమారం, పెద్దగొట్టిముక్కుల, శివ్వంపేట గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను అక్కడి సర్పంచులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివ్వంపేటలో ఆమె మాట్లాడుతూ అన్ని మండలాలకు ధీటుగా శివ్వంపేట మండల కేంద్రంలో అభివృద్ధి పనులు భేషుగ్గా జరిగాయని, దీనికి ముఖ్య కారణం ప్రస్తుత స్థానిక జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త సహకారమేనన్నారు. అదేవిధంగా సర్పంచి పత్రాల శ్రీనివాస్‌గౌడ్, ప్రజల తో కలిసి శివ్వంపేట గ్రామ పంచాయతీని ఆద ర్శంగా చేసుకోవడం అభినందనీయమని చెప్పారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాలు పదవి కాలం పూర్తి చేసుకున్న సర్పంచితో పాటు వార్డు సభ్యులందరూ కలిసి ఇదే వేదికపై ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీటీసీ సభ్యులు మహేష్‌గుప్త, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షులు రమాకాంత్‌రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పి. మాధవరెడ్డి, భాష్‌పల్లి సర్పంచి పార్వతి సత్యం, పెద్దగొట్టిముక్కుల సర్పంచి చంద్రకళ శ్రీశైలం యాదవ్, గోమారం సర్పంచి లావణ్య మాధవరెడ్డి, నాయకులు పిట్ల సత్యనారాయణ, పిల్లుట్ల నర్సింహారెడ్డి, వంజరి కొండల్, పోచాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, జెడ్పీటీసీ మహేష్‌గుప్త

## మహనీయుల జీవితాలు నేటితరాలకు స్ఫూర్తిదాయకం

### -ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, జనవరి31 ప్రభాతవార్త:** మహనీయుల జీవితాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలో ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహం, స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పూర్తి పారదర్శకతతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున మహనీయుల విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, గ్రామ సర్పంచి నితీషా శ్రీకాంత్, గ్రామ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సహకార సంఘం రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

### రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం

**రామాయంపేట, జనవరి 31, ప్రభాతవార్త :** రామాయంపేట సహకార సంఘం పంపిణీచేసే వివిధ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంఘం చైర్మన్ బాదె చంద్రం సూచించారు. బుధవారం రామాయంపేట సహకార సంఘం నుండి చైర్మన్ బాదె చంద్రం, సీఈవో పుట్టి నర్సింలు నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామానికి చెందిన అందె రాజయ్యకు పౌల్ట్రీ లోన్ కింద రూ.8,02,500 చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ సంఘం అన్ని రకాల లోన్‌లు పౌల్ట్రీ, షీప్, డైరీ, రైతు నేస్తం, ల్యాండ్ డెవలప్‌మెంట్ తదితర లోన్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆర్‌టిఏ కార్యాలయంలో రక్తదాన శిబిరం

**కంది, జనవరి 31, ప్రభాతవార్త:** బుధవారం ఆర్‌టిఏ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి స్వచ్ఛందంగా చేరుకున్న 46 మంది 46 యూనిట్ల రక్తాన్నా దానం చేశారు. మోటార్ వెహికల్ అధికారులు కరణ్,కృష్ణ వేణి, శ్రీనివాస్‌ల సమక్షంలో రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా బ్లడ్ బ్యాంక్ సంగారెడ్డి వారి సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంగారెడ్డి కార్యదర్శి కె చందర్, బ్లడన బ్యాంక్ సంగారెడ్డి వైద్యాధికారి నరేష్, బ్లడ్ బ్యాంక్ ఇంచార్జి ఆర్ రాజు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ఇండియ్ రెడ్ క్రాస్ వలంటీర్లు, రక్తదాతలు హాజరయ్యారు.

## చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహణ

**కంది, జనవరి 31, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యను అందుకుంటున్న విద్యార్థలకు బుధవారం జన విజ్ఞాన ఆధ్వర్యంలో మండల స్థాయ చెకుముకి పోటీ పరీక్షలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు మండలస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చాటిన 9 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అధికారులు పేర్కొన్నారు. మండల స్థాయి పోటీలలో ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం విభాగంలో కొత్వాల్ హైస్కూల్ విద్యార్థులు సింధూజ, అల్ఫియానాజ్‌లు, ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం విభాగం నుంచి చేర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పూజిత, అభినయ, అల్ఫియా సుల్తానలు, ప్రభుత్వ తెలుగు మీడియం విభాగంలో చేర్యాల జిల్లా పరిషత్ విద్యార్థులు సంజన, చంద్రిక, సాయి చరణ్‌లు ప్రథమ స్థానంలో నిలిచినట్లు అధికారులు పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని ఆక్రమించిన విద్యార్థులకు చేర్యాల కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వెంకట రాజయ్య సర్టిఫికెట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో జేవివి నాయకలు ఎం.సోమశేఖర్, ఉపాధ్యాయులు రాజశేఖర్, శుకుర్, రీన తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంకు ఝరాసంగం భక్తుల పాదయాత్ర

**ఝరాసంగం, జనవరి 31, ప్రభాతవార్త:** మండల కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో శ్రీశైలంకు భక్తులు పాదయాత్రగా బుధవారం బయలుదేరారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు గ్రామంలోని శ్రీకేతకి సంగమేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రాదయాత్రగా పయనమయ్యారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, ఆలయ ప్రధాన అర్చకులు బసయ్యస్వామి, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, సంజు సింగ్, శివ శంకర్ పాటిల్, వైద్య ఉమేష్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి

### -రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి



భక్తులకు ప్రవచనాలు ఇస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

**కొల్చారం, జనవరి31 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. బుధవారం కొల్చారంలోని శివాలయం, రేణుకా ఎల్లమ్మ, వీరభద్ర ఆలయాలతోపాటు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలన్నారు. అంతకుముందు ఎల్లమ్మ దేవాలయం, వీరభద్ర ఆలయం, శివాలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉమా రాజాగౌడ్, ఎంపీటీసీ అరుణ కృష్ణాగౌడ్, వీరభద్ర ఆలయం, శివాలయం, రేణకా మాతా ఆలయ కమిటీల ప్రతినిధులు జూలకంటి సంగమేశ్వర్, వడ్ల ప్రభాకర్, గంగసాని రాజిరెడ్డి, ఆనంద్‌రాజు, ర్యాగల వీరయ్య, శ్రీశైలం, కరిణ్‌గౌడ్, రాజేందర్ గౌడ్, శేఖర్‌గౌడ్, ఆశన్నగారి అంజయ్య, చంటయ్య, నాగరాజు, శేఖర్, ఎండుగుల కృష్ణ, యాదగిరి, బొజ్జ వెంటరమణ, పాండురంగాచారి, బొజ్జ వీరేశం, చౌరిగారి భాస్కర్, తమ్మలి సంతోష్, చౌరిగారి సంతు, అశోక్, సిద్ధిరాములు, పూజారులు చల్లూరి కృష్ణశర్మ, మురళీధర్, బక్కప్ప పాల్గొన్నారు.

## సోలార్‌తో గ్రామాన్ని మరింత కాంతిమయం చేస్తాం

### -పిల్లుట్ల సర్పంచి పెద్దపులి రవి

**శివ్వంపేట, జనవరి 31 ప్రభాతవార్త:** తమ శక్తి మేరకు చేసిన అభివృద్ధి పనులే కాకుండా సెహగల్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సోలార్ లైట్లతో గ్రామాన్ని మరింత కాంతిమయం చేస్తామని పిల్లుట్ల సర్పంచి పెద్దపులి రవి అన్నారు. బుధవారం సర్పంచి రవి అధ్యక్షతన సెహగల్ సంస్థ ప్రతినిధులు వేమ నారాయణ, సాయికుమార్‌ల ఆధ్వర్యంలో అభిశృద్ధి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయగలిగామని సెహగల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గ్రామానికి కావాల్సిన మౌలిక సదుపాయాలకు కల్పించడం కోసమే సోలార్ లైట్లను అమర్చడం జరిగిందన్నారు. సంస్థ ప్రతినిధి వేమ నారాయణ మాట్లాడుతూ గ్రామస్థుల అభీష్టం మేరకే కావాల్సిన చోట సెహగల్ ఫౌండేషన్ సహకారంతో సోలార్ లైట్లను బిగించడం జరుగుతుందన్నారు. అంతకుముందు గ్రామా పటాన్ని ముగ్గుతో వేసి లైట్లను బిగించడం కోసం మార్కింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సులోచన నర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచి నాయిని దామోదర్, నాయకులు రాఘవరెడ్డి, భాసంపల్లి శ్రీధర్‌గౌడ్, పెద్దపులి యాదగిరి, పిల్లి శివకుమార్, బుర్ర పోచాగౌడ్, బుర్ర సత్యనారాయణ, పెద్దపులి శంకర్, చింత స్వామి, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## కొప్పులపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

**వెల్దుర్తి, జనవరి 31 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లి గ్రామంలో బుధవారం తహశీల్దార్ జ్ఞానజ్యోతి, ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కుల వివక్షత ఉండరాదని, రెండు గ్లాసుల పద్ధతి పాటించకూడదన్నారు. కులాలకుఅతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రకమలో పెద్దలు,యువకులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

# గెలిపించిన ప్రజలకు అండగా ఉంటా

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఎలిమినేడు గ్రామ పంచాయితీ భవనం ప్రారంభం**

**ఎమ్మెల్యేపై పూల వర్షాన్ని కురిపించిన ఎలిమినేడు గ్రామ ప్రజలు**

**ఎలిమినేడు గ్రామ భూ బాధితులకు న్యాయం చేస్తా**



ఎలిమినేడు నూతన గ్రామ పంచాయితీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తదితరులు

**ఇబ్రహీంపట్నం, జనవరి31, ప్రభాతవార్త:** నాపై నమ్మకంతో నన్ను గెలిపించిన నా ప్రజలకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో రూ.55లక్షల వ్యాయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయితీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై ప్రారంభించారు.సర్పంచ్ ఎడమ అశోక్‌వర్ధన్ రెడ్డిని తన చాంబర్‌లో కూర్చో బెట్టి ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రానికి చెసిన అప్పులను ప్రజలకు వివరించారు.అదేవిదంగా గత ప్రభుత్వ వైఫల్యాను ఎండగట్టారు. గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని గత ప్రభుత్వంలో ఇసుమంత అభివృద్ధి కూడ జరగలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి అంటే ఎందో చూపిస్తామని అన్నారు. ఎలిమినేడు గ్రామంలో గత ప్రభుత్వంలో సర్వే నెంబర్ 512లోని 150 మంది రైతులకు అన్యాయం జరిగిందని వారికి అండగా ఉండి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. సిఎం రేవంత్ రెడ్డిపై కేటిఆర్ చేసిన వాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వంలో రాష్ట్రన్ని అప్పుల పాలు చేసి, ప్రభుత్వ ఉద్యోగులకు సరైన సమయంలో జీతాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కెసిఆర్ కుటుంబం అయన పార్టీ నేతలు చేసిన స్కాంలని బయటికి తీసుకవచ్చి జైలుకు పంపడం ఖాయమన్నారు. ప్రజల అండతో ప్రజల వద్దకే పాలన తీసుకవచ్చి ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి కృపేష్, జడ్పిటిసి మహిపాల్, ఎంపిడిఓ వెంకటమ్మ, తహసీల్ధార్ అన్వర్, ఏఈ ఇంద్రసేనా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాంకాల శేఖర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, గురునాథ్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఘన స్వాగతం..**

ఎమ్మెల్యేగా గెలిచిన మెదటిసారి మాజి ఎమ్మెల్యే గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని గ్రామ సర్పంచ్ ఎడమ అశోక్‌వర్ధన్ రెడ్డి అధ్వర్యంలో డప్పు చప్పుళ్లతో, కాళాకారుల నృత్యాలతో, బానాసంచాలతో ఘనంగా స్వాగతం పలికారు. అశ్వరథాలపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు మంగళహారతులతో అడుగడుగున నీరాజనం పట్టారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేపై పూల వర్షాన్ని కురిపించారు.దీంతో గ్రామంలో ఒక్కసారిగా పండగా వాతారణం నెలకొంది. ఎలిమినేడు గ్రామంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విజయోత్సవ ర్యాలీని తలపించింది.

**కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎలిమినేడు సర్పంచ్**

ఎలిమినేడు గ్రామ సర్పంచ్ ఎడమ అశోక్‌వర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సర్పంచ్‌తోపాటు పలువురు గ్రామస్తులు కూడ పార్టీలో చేరారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎలిమినేడు గ్రామ సర్పంచ్ ఎడమ అశోక్‌వర్ధన్ రెడ్డి

## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**మర్పల్లి జనవరి 31 ప్రభాతవార్త:** ఉరివేసకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మర్పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.మడలం లోని ఘనాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి రమేష్ (32) తన ఇంట్లో అనుమానస్పదంగా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రమేశ్ ఆటో నడుపేవాడని శివరాంపురం గ్రామానికి చెందన జ్యోతితో వివాహం జరిగిందని ప్రస్తుతం ఆమే డెలివరికీ తల్లివారి ఇంటికి వెళ్ళిందని అన్నారు.మంగళవారం రాత్రీ కుటుంబ సభ్యులంత తిని నిదిరించారని ఉదయంఎంతకు లేవకపోవడంతో తమ్ముడు తలుపు సందులోంచి చూడగా దూలానికిఉరివేసుకున్నాడనీ ఆర్తిక, ఇబ్బందులు కాని మరే ఇతర కారనాల వల్ల కాని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని తల్లి ఫర్యాదు మెరకు కేసునమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తునట్లు యస్.ఐ తెలిపారు.

## దొంగిలించబడ్డ ఫోన్లు పట్టివేత



బాధితులకు ఫోన్లను అందిస్తున్న ఎస్ఐ.శ్రీధర్‌రెడ్డి

**మర్పల్లిజనవరి 31ప్రభాతవార్త:** గత కొన్ని రోజుల క్రిత్రం పంచలింగాల్,భూచన్‌పల్లి,దార్గులపల్లి గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తుల సెల్‌ఫోన్లు చోరి జరిగినట్లు భాదితులు ఫిర్యాదు చేశారని యస్.ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.అధునాతన సాంకేతిక పరిర్ఞానంతో చోరికి గురైన ఫోన్లను కనిపెట్టి స్వాదీనం చేసుకునిబాధితులకు అప్పగించనట్లు యస్.ఐ తెలిపారు.ఆధితులు పోలీసులకుకృతజ్ణతలు తెలిపారు.

## ఆటో బైక్ ఢీ .. ఒకరికి గాయలు

**యాచారం జనవరి31,ప్రభాతవార్త :** ఆటో బైక్ ఢీకొని యువతికి తీవ్ర గాయాలపాలైన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చేటోచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్ నల్గొండ చౌరస్తాలో దేవరకొండ నుండి వస్తున్న ఆటో హైదరాబాద్ నుండి వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పైన ఉన్న యువతి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చేర్పించారు.సంఘటన స్థలంలో ఆధార్ కార్డు లభ్యమైనట్టు ఇప్పటివరకు కేసు నమోదు కాలేదని సిఐ తెలిపారు.

## కేసిఆర్ కుట్రను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు

**చేవెళ్ల నియోజకవర్గం యూత్ అధ్యక్షులు కె.శ్రీనివాస్‌గౌడ్**



తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

**చేవెళ్ల, జనవరి 31 ప్రభాతవార్త :** కేసిఆర్, కేటిఆర్ కుట్రను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, తెలంగాణ రావడానికి కృషిచేసిన కోదండరాంని ప్రజలు ఎవరూ మరువలేరని తెలంగాణ జన సమితి చేవెళ్ల నియోజకవర్గం యూత్ అధ్యక్షులు కె.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ కోదండరాం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమిం చినప్పటికి ప్రమాణస్వీకారాన్ని అడ్డుకుంటున్న కేసిఆర్ ఎత్తుగడలను నిరసిస్తూ చేవెళ్లలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర నల్లని రిబ్బెన్‌లను ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కక్ష్యపూరితమైన రాజకీయాలను చేయొద్దని, ఒక గొప్ప వ్యక్తిని తండ్రి, కొడుకులు ఇలా చేయడం మన ముఖ్యమంత్రి అయినటువంటి ఎనుముల రేవంత్ రెడ్డి నచ్చక మా ప్రభుత్వం గుర్తించామని తెలియజేయడం సంతోషకరమన్నారు. కేసిఆర్, కేటీఆర్ కుట్రకు శాంతియుతంగా నిరసన తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిజేఎస్ నాయకులు, చేవెళ్ల మండల యూత్ అధ్యక్షులు మహేందర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, సత్యనాయణ గౌడ్, శివకుమార్,రవి కృష్ణచారి,శ్రీశైలం, గణేష్, ఆదర్శ్, అమరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**-ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్**

**కొడంగల్,జనవరి 31ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రాధమిక ఆరోగ్య వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందుకుగాను ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు.మండల పరిధిలోని హస్నాబాద్‌లో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాధమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, గ్రామసర్పంచ్ బి.పకీరప్పలతో కలిసి ప్రారంబించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నదని,ఇందుకుగాను ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.కార్యక్రమంలో గ్రామస్తులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, పట్టుదల ఉంటే దేనినైన సాధించవచ్చు

**తాండూరు డిఎస్‌పి శేఖర్ గౌడ్**

**పెద్దేముల్, జనవరి 31, ప్రభాతవార్త:** విద్యార్థులు, క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకుంటే దేనినైన సాధించవచ్చని తాండూరు డిఎస్‌పి శేఖర్ గౌడ్ అన్నారు. బుదవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో జడ్‌పిటిసి ధారాసింగ్ అధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల పోటిల బహుమతుల ప్రదానోత్సవానికి డిఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కష్టపడే తత్వం అలవర్చుకుంటే ఆయా రంగాలు అభివృద్ధి చెందెందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. మీలోని బద్ధ శుత్రువు మీ సోమరితనమేనని, క్రమశిక్షణతో పనిచేస్తే ప్రపంచాన్ని జయించవచ్చని అన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమేనని, ఓటమి గెలుపుకు నాంది అని అన్నారు. విద్యార్థులు కష్టంతో పాటు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభ్యున్నతికి ధారాసింగ్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కన్వీనర్ యండి రియాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు ఎన్.ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్ గుప్తా, ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములు, మాజీ యంపిటిసి విద్యాసాగర్, కోఆప్షన్ సభ్యులు నసీర్, సీనియర్ నాయకులు కోహీర్ రవిశంకర్, రాము నాయక్, డివై నర్సిములు పాల్గొన్నారు.

**విద్యార్థుల భవిషత్తు కోసం కృషిచేస్తా: జడ్‌పిటిసి దారాసింగ్**

విద్యార్థుల భవిషత్తు కోసం తాను నిరంతం కృషిచేస్తానని జడ్‌పిటిసి, పీసీసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. తనకు పదవులు ముఖ్యం కాదని,విద్యార్థుల అభ్యున్నతే తన ధ్యేయమని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. ప్రతి యేటా మండల స్థాయి క్రీడల పోటిలను నిర్వహించి ప్రతిభాగల విద్యార్థులను గుర్తించి వారిని జిల్లా స్థాయి,రాష్ట్ర స్థాయి,జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనేందుకు తనవంతు కృషిచేస్తానని అన్నారు.

## నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలి

**జాతీయ విధానాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా**



సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్

**చేవెళ్ల, జనవరి 31 ప్రభాతవార్త :** మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం 2020 ఉపసంహరించుకోవాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేష్ పేర్కొన్నారు.చేవెళ్ల మండల కేంద్రంలో పిడిఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేష్ మాట్లాడుతూ...పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది జరిగే మహాధర్నాని విజయవంతం చేయాలన్నారు.అడ్డు అదుపులేని విద్య వ్యాపారీకరణ, విద్యా ప్రైవేటీకరణ, విద్యా కార్పొరేటీకరణని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న దన్నారు. విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ చేయడంలో కేంద్ర ప్రభుత్వం అనుకూ లంగా ఉందని ఇప్పటికే ప్రైవేట్ యూనివర్సిటీలు విదేశి యూనివర్సిటీలు మన దేశ విద్యారంగాన్ని కబలిస్తున్నాయని విద్యపై ఏకాభిప్రాయం కాకుండా భిన్నాభిప్రాయం కలిగి ఉండాలని అన్నారు. ఈ విధానం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడం తప్ప మరోకటి కాదు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి జైపాల్, శ్రీకాంత్,మండల అధ్యక్ష, కార్యదర్శి నర్సింహ,అశోక్, నాయకులు అశోక్, సురేస్, శివకుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**చేవెళ్ల, జనవరి 31 ప్రభాతవార్త :** కొండా వెంకట రంగారెడ్డి, కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజవకర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ చేవెళ్ల మండల కేంద్రంలోని కెవీఆర్ గ్రౌండ్‌లో త్వరలో ప్రారంభం కానుందని అత్తెల్లి అనంతరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామస్థాయి క్రికెట్ జట్టు పాల్గొనడానికి అవకాశం ఉందన్నారు. పార్లమెంట్ పరిధిలోని చేవెళ్ల, పరిగి, వికారాబాద్,తాండూరు, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి,మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని జట్లు పాల్గొంటాయన్నారు. ఈ టోర్నమెంట్ విజేత జట్టుకు రూ.3లక్షలు, రన్నర్ జట్టుకు రూ.2లక్షల ప్రైజ్ మనీగా చేవెళ్ల మాజీ ఎంపీ, భాజపా నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రకటించినట్లు వారు తెలిపారు. టోర్నమెం ట్‌లో పాల్గొదలచిన జట్లు మొబైల్ నెంబర్ అత్తెల్లి అనంతరెడ్డి 9849153278,కిట్టు 7893122562,శరత్ 9849007513 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## విజ్ఞానం పెంపొందించేందుకు విహారయాత్ర దోహదం





విహారయాత్రలో విద్యార్థులు

**కొడంగల్,జనవరి 31ప్రభాతవార్త** విద్యార్దులకు విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విహారయాత్రలు ఎంతో దోహదపడుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లూరి క్రాంతికుమార్ అన్నారు.బుధవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ ప్రాధమిక పాఠశాల విద్యార్దులను విహారయాత్ర నిమిత్తం మహబుబ్‌నగర్‌లోని పిల్లలమర్రి,మయూరి పార్కు, మన్యంకొండ తదితర ప్రాంతాలకు వెళ్ళారు.ఈ సందర్భంగా పిల్లల మర్రిలోని వృక్షాలు తదితర వాటి విశేషాలను తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతు విద్యా ర్దులకు విహారయాత్రతో విజ్ఞానం పెంపొందించేందుకు తోడ్పాటునం దిస్తుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్యతో పాటు విద్యార్దులు ఉన్నారు.

## హస్నాబాద్ చెర్వుతూంకు మరమ్మత్తులు చేపట్టాలి



చెర్వుతూంకు మరమ్మత్తులు చేపట్టాలని అధికారికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్దులు

**కొడంగల్,జనవరి 31ప్రభాతవార్త** మండల పరిధిలోని హస్నాబాద్ పెద్ద చెర్వుకు ఉన్న పెద్ద తూంకు మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్దులు టీ.భీమయ్య,మల్లిఖార్జున్ తదితరులు కోరారు.ఈ మేరకు బుధవారం చెర్వుతూంను నీటిపారుదల శాఖ అధికారులు కిరణ్‌తో కలిసి పరిశీలించారు.పెద్ద చెర్వుతూం లీకేజీల కారణంగా నీరు వృధాగా పోతుందని,ఇందుకుగాను తక్షణమే చెర్వుతూంకు మరమ్మత్తులు చేపట్టాలని వినతిపత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మండలంలోని అధిక ఆయకట్టుగా పేరున్న హస్నాబాద్ పెద్ద చెర్వుతూం లీకేజీల కారణంగా నీరు పారుతుండడంతో పంటలకు నీరు అందక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని,ఇందుకుగాను తక్షణమే చెర్వుతూంకు మరమ్మత్తు పనులు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.ఈసందర్భంగా గ్రామస్దులు,రైతులు ఉన్నారు.

## పేకాడుతున్న 9 మంది అరెస్టు

**శంకర్‌పల్లి, జనవరి 31 ప్రభాతవార్త:** మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్‌లోని ఒక రేకుల ఇంటిలో ఈ నెల 30 మంగళవారం నాడు పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశారు. ఈ దాడిలో 9మంది పేకాడుతుండగా, వారిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.88,100 నగదు, 9 సెల్ ఫోన్లు, 104 పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మోకిల ఎస్‌హెచ్ఓ తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త:** విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల కారణంగా గురువారం గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఘట్‌కేసర్ ఏఇ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అంకుషాపూర్ 33/11 కెవి ఉపకేంద్రం పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా మాదారం 11కెవి వ్యవసాయ కనెక్షన్లు, కంపెనీ ఫీడర్‌లో కాలనీలకు కరెంటు ఉండదని తెలిపారు. ఎదులాబాద్ 11 కెవి ఫీడర్ పరిధిలోని ఎదులాబాద్ వ్యవసాయ కనెక్షన్లకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ ఉండదని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఇ సతీష్‌కుమార్ కోరారు.

## సీఐ గోవర్ధనగిరికి ఇడబ్ల్యుఎస్ నేతల సన్మానం



సీఐ గోవర్ధనగిరిని సన్మానిస్తున్న ఇడబ్ల్యుఎస్‌కాలనీ నాయకులు

**ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.గోవర్ధనగిరిని ఇడబ్ల్యుఎస్‌కాలనీ నాయకులు కలిశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సిఐని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు సిఐని కలిసి కాలనీలో దొంగతనాల నివారణకు రాత్రి పూట పట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీ కార్యదర్శి పి.శశిధరణ్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, నాయకులు బర్ల రాధాకృష్ణ, మన్నె సత్తిరెడ్డి, దంతూరి గోపాల్‌గౌడ్, కాజీపేట సత్యనారాయణ, బొక్క ప్రభాకర్‌రెడ్డి, పిల్లి అశోక్‌లు సిఐని కలిశారు.

## ప్రజల్లో మరింత చైతన్యం రావాలి

**ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు**

**పొన్నాల్‌లో ఘనంగా పౌరహక్కుల దినోత్సవం**



పొన్నాల్‌లో పౌరహక్కుల దినోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ చంద్రశేఖర్, సర్పంచు,ఎంపిటిసి,ఉపసర్పంచు,వార్డుసభ్యులు, ప్రజలు

**శామీర్‌పేట, జనవరి 31,ప్రభాతవార్త**

ప్రజల్లో మరింత చైతన్యం రావాలని, బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని శామీర్‌పేట మండల ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు సూచించారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని పొన్నాల్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగ సమావేశాన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగ పాల్గొన్న శామీర్‌పేట ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు మాట్లాడుతూ దళితులు అందరు కూడ తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. డాక్టర్ అంబేద్కర్ కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అణగారిన, నిమ్నజాతుల వారు ఇబ్బందులు పడుతుంటే చర్చించుకోవటానికి అవకాశం ఉందని సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. దళితవాడల సమస్యలు ఉంటే పరిష్కరించటం జరుగుతుందన్నారు. పొన్నాల్ గ్రామంలోని ఎస్సీకాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని పలువురు ఎస్సీవాడకు చెందిన మహిళలు ఆ తరువాత కోరారు. శామీర్‌పేట మండల తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల, హక్కుల పట్ల అవగాహన కల్పించటానికి ప్రజలు అందరు సమానం అని ఎలాంటి వివక్షలకు తావు లేకుండ జీవనాలు కొనసాగాలని, ఇతరుల నుంచి ఇబ్బందులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు బి.సుకన్యసత్యనారాయణగౌడ్, ఎంపిటిసి ఎం.మౌనికప్రసాద్, ఉపసర్పంచు గడ్డం ప్రసాద్, వార్డుసభ్యులు, మండల పంచాయతీ అధికారి మంగతాయారు, పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌రావు, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ అజయ్‌లక్ష్మి, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**షాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :**

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సంత్ శ్రీ ఆశారామ్ జీ ఆశ్రమం నిర్వాహకులు పరమేశ్వర్ అన్నారు. ఆశ్రమం ఆధ్వర్యంలో విద్యార్థులకు భరత నాట్యం గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అం దజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి విద్యార్థి భారతీయ సాంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థి దశ ఉండే క్రమ శిక్షణ అలవరు చ కోవాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈకార్య క్రమంలో శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీరాములు తదితరులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి : జడ్పీటీసీ, ఎంపీపీ

**షాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేం దర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నసోలిపేట్ గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామన్నారు. గత పదేళ్ల కాలంలో మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో గ్రామాలన్ని అభివృద్ధి చెందాయన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ నర్సింగ్‌రావు, ఎంఈవో శంకర్‌రాథోడ్, సర్పంచ్ బోరాంచ రమ్యకృష్ణ, ఎంపీటీసీ మామిడి లత, నాయకులు రాంచెంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

## నెహ్రూ యువ కేంద్ర అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా దాదె మహేష్

**షాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** నెహ్రూ యువ కేంద్ర అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా దాదె మహేష్‌ను నియమించినట్లు కేంద్ర యూత్ అఫర్స్, స్పోర్ట్స్ శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్ ప్రకటించారు. బుధవారం నియామక పత్రాన్ని జిల్లా అధికారి ఐజయ్య చేతుల మీదుగా తీసుకున్నారు. ఈసందర్భంగా దాదె మహేష్ మాట్లాడుతూ.... జిల్లాలో యువజన సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, క్రీడలు, సమాజ సేవలో యువత పాల్గొనేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నన్ను జిల్లా అడ్వైజర్ కమిటీ సభ్యులుగా నియమించినందుకు కేంద్రమంత్రి అనురాగ్ ఠాగూర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రోగులకు సరైన వైద్యం అందించాలి

**షాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలని షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్‌లోని ప్రాథమిక ఆసుపత్రిని సందర్శించి, అటెండెన్స్ రిజిస్టార్‌ను చూశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..... ఆసుపత్రిని అమోజాన్ కంపెనీ వాళ్లు అన్ని హంగులతో సుందరీకరణ చేశారని, ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది శంకర్ తదితరులు ఉన్నారు.

## ఫిబ్రవరి 5నుండి మీరాపూర్ దర్గా ఉత్సవాలు

**షాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** ఫిబ్రవరి 5నుండి 6వరకు షాబాద్ మండల పరిధిలోని మీరాపూర్ దర్గా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు చెన్నాబాయి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ఫిబ్రవరి 5,6 తేదీల్లో దర్గా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం కవాలి జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని, ఈ ప్రత్యేక ప్రార్ధనల్లో పలువురు రాజకీయ నాయకులు వస్తున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మార్క్ !

**మున్సిపల్ వర్గపోరుకు చెక్ .?**

**పంతాలు.. పట్టింపులు వద్దు..**

**ప్రజాసమస్యలు, పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలి**

**పాలకవర్గానికి సూచించిన ఎమ్మెల్యే**

**సాదా సీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం**

**ఎజెండాలోని 22 అంశాలు ఆమోదం, రెండు తిరస్కరణ**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**తాండూరు, జనవరి 31, ప్రభాతవార్త :** గత నాలుగేళ్లుగా ప్రజా సమస్యలు, పట్టణాభివృద్ధి పట్టించుకోకుండా ఆదిపత్య పోరుతో కొనసాగుతున్న తాండూరు మున్సిపల్ పాలకవర్గం వ్యవహారాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చక్కదిద్ది తన మార్క్‌ను చాటుకున్నారు. ప్రజలు ఎంతో నమ్మ కంతో ఎన్నుకున్నారని.. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పంతాలు.. పట్టింపులకు పోకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కౌన్సిలర్లకు సూచించారు. బుధవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత నాలుగేళ్లుగా కౌన్సిల్ సమావేశం అంటేనే అట్టుడికి పోయేది. తొలిసారి కౌన్సిల్ సమావేశంలో అలాంటి పరిణామాలు కనిపించలేదు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో సమావేశం సాఫీసీదాగా కొనసాగింది. ఎజెండాలోని 24 అంశాలను ప్రవేశ పెట్టగా 22అంశాలకు సభ్యులు అమోదం తెలిపారు. 2అంశాలను తిరస్కరించి సమావేశం సజావుగా ముగించారు. అయితే, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. గడిచిన నాలుగు సంవత్సరాలు ఏం జరిగింది అనేది పక్కన పెట్టి మిగిలిన ఏడాది సమయాన్ని వృధా చేయకుండా సభ్యులంతా కలిసికట్టుగా పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. కౌన్సిల్‌లో ప్రతిపక్షం, పాలకపక్షం రెండు ఉండాలని, ఈ రెండు కూడా ప్రజల పక్షంగా పనిచేయాలని, వ్యక్తిగత స్వార్థంగా పనిచేయరాదని తెలిపారు. ప్రజలకు మేలు చేయడమే మన ఎజెండాగా పెట్టుకోవాలని అన్నారు. ప్రజల పక్షాన పనిచేస్తే సభ్యులతో పాటు ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మున్సిపల్‌లో అందరు ఐక్యంగా ఉండి ఇక్కడి వనరులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. మున్సిపాల్టీలో స్థానికంగా రాజకీయ ఎత్తుగడుల వల్ల అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయని, ఇతర మున్సిపాల్టీలతో పోల్చితే నిధుల కేటాయింపు కూడ సక్రమంగా జరగలేదని తెలుస్తుందని అన్నారు. ఈ విషయాలను పాలకవర్గం అర్థం చేసుకొని ఈ మిగిలిన ఏడాదిలో పట్టింపులు, రాజకీయ ఎత్తుగడలను పక్కన పెట్టి ప్రజా సమస్యలపై పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం మీరు చేసే అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో మరో ఐదేళ్ల ప్రజలు మీకే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు. మరోవైపు మొదటి సారిగా కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు ఘనంగా సన్మానించారు.

